


అల్లుకున్న నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సుధా కాలనీలోని అనేక ప్రాంతాలలో పాదు తీగలు విద్యుత్ స్తంభాలకు చుట్టుకుని విద్యుత్ వైర్లను అల్లుకుపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. వీటి వల్ల విద్యుత్ సరఫరాకు సైతం ఇబ్బందులు వస్తున్నాయని వారంటున్నారు. అయినా విద్యుత్ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటిని తొలగించాలని కోరుతున్నారు.



సుధాకాలనీలో విద్యుత్ తీగలను అల్లుకున్న పాదులు

భారమంతా పంచాయతీలపైనే...

సచివాలయాల నిర్వహణతో తప్పని అవస్థలు

అదనపు ఖర్చులతో సతమతం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఇప్పటికే నిధులు లేమితో తీవ్రంగా సతమతమవుతున్న గ్రామపంచాయతీలపై అదనపు భారం తప్పడం లేదు. పాలన చేరువ కావాలని వైసిపి ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే వాటి నిర్వహణ బాధ్యతను మాత్రం గాలికి వదిలేసింది. కేవలం సిబ్బందికి జీతభత్యాలు మాత్రమే ప్రభుత్వం ఇస్తుండగా, మిగిలిన వ్యవహారాలన్నీ పంచాయతీలే చక్క చక్కదిద్దుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆదాయం రాబడి అంతగా లేని పలు పంచాయతీలు ఈ బాధ్యతలతో ఆర్థిక కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,103 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వ సేవలు మరింత సులభమైన పద్ధతిలో ప్రజలకు అందించాలనే లక్ష్యంతో గ్రామ,వార్డు సచివాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఒక్కో దానిలో 11మంది సిబ్బందిని నియమించారు. ఉమ్మడి జిల్లాల్లో 1,271 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు.

పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులను ఖర్చు చేసే అవకాశం ఇవ్వలేదు. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘాల నిధులు సైతం సక్రమంగా ఖర్చు చేయలేని పరిస్థితుల్లో ఉన్నామని సర్పంచ్ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలకు సాధారణ నిధులు సైతం అంతగా రావడం లేదు. ఈ నేపథ్యంలో సచివాలయాల నిర్వహణ పెద్ద భారంగా మారిందని పలు పంచాయతీ అధికారులు, అటు సర్పంచ్ లు ఆవేదన చెందుతున్నారు. రోజూ వారీ నిర్వహణకు, స్టేషనరీకు పలు చోట్ల పంచాయతీలే డబ్బులు ఖర్చు చేస్తున్నాయి. కొన్ని చోట్ల అయితే సచివాలయ సిబ్బంది సొంతంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నెలకు రూ.1500 చొప్పున నిర్వహణ ఖర్చులు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం చెప్పిన కేవలం ఏడాదిలో ఒకసారి మాత్రమే రూ.1500 ఇస్తున్నారు. అయితే ఒక్కో సచివాలయంకు నెలకు రూ.3,500 నుంచి రూ.5 వేల వరకు నిర్వహణ ఖర్చులు అవుతున్నాయి. ఇవి కాకుండా కరెంట్ బిల్లులు అదనం.

ప్రింటర్ మరమ్మతులు, ఇంకుల కొనుగోళ్లు, ఇంటర్నెట్ బ్యాలెన్స్ రీఛార్జ్, కంప్యూటర్ రిపేర్లు, పేపర్లు, పుస్తకాలు ఇలా అన్ని రకాల వస్తువులకు సంబంధించిన వాటికి డబ్బులు సర్పంచ్ లే ఖర్చు చేస్తున్నారు. మొదట్లో మాత్రమే కొంత స్టేషనరీ ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపు కుందనే విమర్శలున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, కార్మికుల జీతభత్యాలు, వీధి దీపాలు ఇలా అనేక విధాలుగా పంచాయతీలు నిర్వహణ భారం మోస్తుండగా సచివాలయాల విద్యుత్ బిల్లులు, కార్యాలయాల నిర్వహణ కూడా వీటిపైనే పడుతుండడంతో ఆర్థిక పరిస్థితులు నానాటికి దిగజారుతున్నాయని పలువురు సర్పంచ్ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దర్శిత్ మరణం బాధాకరం

కలెక్టర్ కృతికాశుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

చిన్నారి దర్శిత్ మరణం బాధాకరమని కలెక్టర్ కృతికాశుక్లా ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుదాఘాతానికి గురై కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తాళ్లపూడికి చెందిన దర్శిత్(3) ఈనెల 25న మృతిచెందిన విషయం విదితమే. హోం మంత్రి పర్యటన వల్ల బాలుడికి శస్త్రచికిత్స ఆలస్యమైందని, అందువల్లే చిన్నారి మృతి చెందాడంటూ వస్తున్న వార్తలు నిజం కాదన్నారు. చిన్నారి ఆసుపత్రిలో చేరే నాటికే పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఇన్ఫెక్షన్ కారణంగా బాలుని రెండు కాళ్లను వైద్యులు తొలగించారన్నారు. బాలుని కాపాడేందుకు ఈ నెల 25న మరోమారు అతనికి శస్త్ర చికిత్స చేయాలని వైద్యబంద నిర్ణయించిందన్నారు. వివిధ అంశాల్లో అతని ఆరోగ్యం సహకరించక పోవడంతో, పరిస్థితిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేస్తూ సర్జరీని వైద్యులు వాయిదా వేశారన్నారు. అదే రోజు చికిత్స పొందుతున్న బాలుని పరామర్శించి, తల్లిదండ్రులకు ధైర్యం తెలిపేందుకు హోం మంత్రి వచ్చారన్నారు. అతనికి అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారన్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారన్నారు. అనంతరం దర్శిత్‌కు మెరుగైన వైద్య సేవలు అందించినప్పటికీ మల్టీఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా దురదష్టవశాత్తు అతడు మతి చెందినట్టు వైద్యులు తెలిపారన్నారు. శస్త్ర చికిత్స ఆలస్యం కావడం వల్ల బాలుడు మరణించినట్లు వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తమని, ఆరోగ్య పరిస్థితి విషమించడం కారణంగానే దర్శిత్ మృతి చెందాడని కలెక్టర్ స్పష్టం చేశారు.

శాయ శక్తుల ప్రయత్నించాం...

జిజిహెచ్ సూపరింటెండెంట్ హేమలత

చిన్నారి దర్శిత్ ప్రాణానికి కాపాడేందుకు శాయశక్తులా ప్రయత్నించామని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.హేమలతాదేవి పేర్కొన్నారు. ఆదివారం ఆమె తన ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 12న దర్శిత్ ఆసుపత్రిలో చేరాడన్నారు. మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా ఈనెల 25న చికిత్స పొందుతూ మరణించారన్నారు. హైటెన్షన్ వైర్ విద్యుత్ ప్రమాదం కారణంగా ఆసుపత్రిలో చేరినప్పటికే పేషంట్ ఆరోగ్య పరిస్థితి బాలేదన్నారు. ఎక్కువ భాగం కాలిపోవడంతో ఇన్ఫెక్షన్ సోకిందన్నారు. ఈ నెల 25న శస్త్రచికిత్స చేయవలసినప్పటికీ పేషంట్ ఆరోగ్య పరిస్థితి సహకరించకపోవడంతో సర్జరీని వాయిదా వేశామన్నారు. అదే రోజున బాలుడుని పరామర్శించేందుకు హోం మంత్రి వచ్చారన్నారు. చిన్నారి తల్లిదండ్రులను ఓదార్చి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారన్నారు. హోం మంత్రి పర్యటన కారణంగా శస్త్ర చికిత్స ఆలస్యం కాలేదన్నారు. ఎప్పటికప్పుడు చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులకు తెలియజేశామన్నారు. ఈ సమావేశంలో ఎనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ విష్ణు వర్ధన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పర్విన్, ప్లాస్టిక్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రత్నభూషణ్, పీడియాట్రిక్స్ హెచ్ఒడి ఎంఎస్.రాజు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిజిహెచ్ సూపరింటెండెంట్ హేమలతాదేవి

ఘనంగా బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

బాదం బాలకష్ణ ఐ బ్యాంక్ 16వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డులోని బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఐ బ్యాంక్ చైర్మన్ దాకమర్రి శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ వంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా సమాజానికి ఉపయోగకరమైన ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని నాలుగు ప్రధాన ఐ బ్యాంక్‌ల్లో బాదం బాలకష్ణ ఐ బ్యాంక్ ఒకటని గుర్తు చేశారు. ఈ ఐ బ్యాంక్ కాకినాడ నగరానికే కాకుండా మన ఉభయ గోదావరి జిల్లాలకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ ఐబ్యాంక్‌కు అన్ని విధాలా తన సహాయసహకారాలు ఉంటాయన్నారు. నేత్రదాన ఉద్యమంలో పాల్గొంటానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ భాస్కర్ రామ్ మాట్లాడారు. గత 15 ఏళ్లగా కార్నియల్ అంధత్వ నివారణకు బాధం బాలకష్ణ ఐ బ్యాంక్ ఎంతగానో కృషి చేసిందన్నారు. ఈ క్రమంలో 16వ వార్షికోత్సవం జరుపుకుంటున్న కాకినాడ 'ఐ' ఫౌండేషన్‌కి అభినందనలు తెలిపారు. ఐబ్యాంక్ అభివద్ధికి సమిష్టిగా అందరూ తమ సహకరించాలని కోరారు. ఐబ్యాంక్ ద్వారా చూపు పొందిన కార్నియా గ్రహీతలను అభినందించారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యులు మాట్లాడారు. వారిలో తమ వారి నేత్రాలను దర్శించుకున్నట్టుగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సెక్రటరీ డాక్టర్ బాదం బాలకృష్ణ, కోశాధికారి దాసరి సాయికృష్ణ, ట్రస్టీలు డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, డాక్టర్ రావుల శ్రీరామ్, డాక్టర్ డి.విజయలక్ష్మి, కె.మురళీకృష్ణ, పైడా వెంకటనారాయణ, ఎస్.పాపారావు, టి.రామకృష్ణారెడ్డి, చెలికాని వెంకటసూర్యారావు, సోమేశ్వరరావు, జివిఎస్.గాంధీజీ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి

అన్నదానానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శంగార వల్లభస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహణకు గుంటూరుకు చెందిన డాక్టర్ పోసాని శ్రీనివాసరావు, డాక్టర్ పోసాని శ్రీలక్ష్మి రూ.10 వేలు విరాళంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వచనాలనంతరం దాతలకు ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ పెదపూడి మండల అధ్యక్షునిగా లాజరస్

ప్రజాశక్తి - పెదపూడి



యుటిఎఫ్ పెదపూడి మండలం అధ్యక్షునిగా వి.విజయాలాజరస్ ఎన్నికయ్యారు. ఈ నెల 26న కాకినాడలోని యుటిఎఫ్ హోంలో జరిగిన సమవేశంలో పెదపూడి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా సహా అధ్యక్షుడు ఐ.ప్రసాదావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండలంలోని 67 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర్‌వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శిగా డిఆర్‌కె.వర్మ, సహా అధ్యక్షుడిగా డి.లోవరాజు, గౌరవాధ్యక్షునిగా పి.సత్యనారాయణ, మహిళా సహ అధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి, కోశాధికారిగా జి.నాగేంద్రప్రసాద్ ఎంపికయ్యారన్నారు. వీరికి పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

దేశ సమైక్యతకు మత సామరస్యం కీలకం

రాజ్యాంగం ప్రకారమే పాలన సాగాలి

ప్రజాశక్తి - కాకినాడ

దేశ సమైక్యత సమగ్రతలకు మతసామరస్యమే కీలకమని, రాజ్యాంగం ప్రకారమే పాలన సాగాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ తెలిపారు. శనివారం స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో రఘుపతి వేంకటరత్నం నాయుడు(ఆర్‌విఎన్) స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 'బాబ్రీ మసీదు విధ్వంసం– 30 ఏళ్ల అనంతర పరిణామాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రభాకర వర్మ ముఖ్యవక్త గా ప్రసంగించారు. బాబ్రీ మసీదు చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత భారత దేశ ఔన్నత్యాన్ని దెబ్బతీసిందన్నారు. భారత స్వాతంత్ర్య పోరాట ఆకాంక్షలకు అనుగుణంగా బాబాసాహెబ్ అంబేడ్కర్ సారథ్యంలో రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. దేశంలో ఎన్ని అంతరాలు, బేధాలు ఉన్నా అంతా భారతీయులమే అనే గొప్ప స్ఫూర్తిని రాజ్యాంగం కల్పిస్తుందన్నారు. అయితే ఇటీవల కేంద్రం నిర్ణయాలతో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ప్రజలంతా మతసామరస్యం పాటిస్తూ రాజ్యాంగ హక్కుల రక్షణకు నడుం కట్టాలన్నారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఇబ్రహీం మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగించాలన్నారు. దేశంలో సామాజిక అంతరాలు, ఆర్థిక వ్యత్యాసాలు పోవాలన్నారు. సదస్సుకు ముందుగా యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు టి.అన్నారాం రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివించారు. ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఐ.ప్రసాదరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.రాజా, ఉపాధ్యాయులు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.



స్టడీ సర్కిల్‌లో మాట్లాడుతున్న జి.ప్రభాకరవర్మ

సూర్యనారాయణమూర్తికి పలువురి నివాళి

ప్రజాశక్తి-కరప

ప్రముఖ క్రికెటర్ దేవు మధువీరేష్ తండ్రి, గ్రామ పెద్ద దేవు సూర్యనారాయణమూర్తికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఆయన ప్రథమ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, మాజీ హోం మంత్రి, పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ, టిడిపి ఎంఎల్సి చిక్కాల రామచంద్రరావు పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారు. సూర్యనారాయణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధు వీరేష్ క్రికెట్ రంగంలో యువతకి స్ఫూర్తినిస్తూ ప్రతి సంవత్సరం సంక్రాంతి క్రికెట్ పోటీలు నిర్వహిస్తు సొంత ఖర్చులతో క్రీడా సామగ్రిని యువ క్రీడాకారులకు అందిస్తుంటారు. ఆయన తాతగారు బిరుదు ఫకీర్ రాజు తాళ్లరేవు నియోజకవర్గం ఎంఎల్ఏగా పనిచేశారు. దీంతో వారి కుటుంబం రాజకీయనాయకులతో సత్సంబంధాలను కలిగి ఉంది. ఈ కార్యక్రమంలోని జడ్‌పిటిసి సభ్యులు యాళ్ల సుబ్బారావు, రెడ్డిపల్లి వరరమేష్, గొర్రెల కామేశ్వరరావు, సర్పంచ్ ఆశాజ్యోతి, ముత్యాల సతీష్, దేవు వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి పి.భీమేశ్వరరావు, నక్కా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



సూర్యనారాయణ మూర్తికి నివాళులర్పిస్తున్న నాయకులు



బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధనంగా ఉపయోగపడుతుందని ఒఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదేశ్‌కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ కె.చిన్నారావు అన్నారు. మూడు రోజులపాటు స్థానిక శ్రీ ప్రకాష్ ఎనర్జీ స్కూల్లో జరిగిన సిబిఎస్ఇ సౌత్ జోన్ యోగా పోటీల ముగింపు సభను ఆదివారం నిర్వహించారు. ఈ సభకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, యోగాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యోగా వల్ల మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రవీంద్రనాథ్, ప్రొఫెసర్ ఎస్ఆర్.సంతానం, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్. మూర్తి ప్రసంగించారు.

విజేతలు వీరే

అనంతరం విజేతలను ఛీఫ్ జడ్జి రాపర్తి శ్రీను ప్రకటించారు. అండర్ -14 బాలుర విభాగంలో తమిళనాడులోని కుందుర్తూర్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. బాలికల విభాగంలో తమిళనాడులోని విరుదు నగర్ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారన్నారు. అండర్ -19 బాలుర విభాగంలో తమిళనాడులోని బిరుదు నగర్, బాలికల విభాగంలో తమిళనాడులోని అయంబాకం విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అండర్ - 14 బాలుర సింగిల్స్ విభాగంలో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్, బాలికల విభాగంలో కాంచీపురం విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అండర్- 19 బాలుర సింగిల్స్ విభాగంలో తమిళనాడుకు చెందిన అయంబాకం, బాలికల విభాగంలో చెన్నయ్‌లోని కెఆర్ఎం స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.



చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న సప్తగిరి హేచరీస్ అధినేత స్నేహితులు

ఆశ్రమంలో రొట్టెలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

సప్తగిరి యాచరీస్ అధినేత సత్తి సూర్యనారాయణరెడ్డి పుట్టినరోజు సందర్భంగా కోరంగి దుర్గామల్లేశ్వరి వద్దుల, అనాథ ఆశ్రమంలో పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. మండలానికి చెందిన ఎస్ఆర్ఆర్ ఎంటర్ ప్రైజెస్ అధినేత పెయ్యల రమేష్ ఆధ్వర్యంలో వృద్ధులు, చిన్నారులకు రొట్టెలు, పండ్లు అందజేశారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న సూర్యనారాయణరెడ్డికి ఈ సందర్భంగా చిన్నారులు శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజున ఆర్భాటాలకు పోకుండా ఇలా అనాథ ఆశ్రమాల్లో జరుపుకోవడం మంచి సంప్రదాయమని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో షణ్ముఖ రాజు, మోకా విష్ణు, విప్పర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం కాకినాడ వారి సహకారంతో యువ చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భారత రాజ్యాంగం విశిష్టత, రాజ్యాంగం ద్వారా ప్రసాదించిన హక్కులు, అంబేద్కర్ జీవిత చరిత్ర, సమాచార హక్కు చట్టం వంటి వాటిపై విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా సిడబ్ల్యుసి బోర్డు సభ్యులు పి.సంతోషికుమారి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.జ్యోతిర్మయి, లెక్చరర్ పి.గాయత్రీశ్వరిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిఎస్–ఎస్ ప్రెసిడెంట్ ఎన్ఎల్.వినోద్‌కుమార్, ప్రిన్సిపల్ టి.వీరయ్యచౌదరి, సెక్రటరీ పి.రాధా శ్రావణి, వైస్ ప్రెసిడెంట్ పి.మణిమాల, బోర్డు సభ్యులు టి.రితి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

గ్రంథాలయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని లైబ్రేరియన్ ఎం.శ్రీనివాసరావు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన విద్యార్థులతో చందమామ కథలు, అల్లాద్దీన్, ది ప్లాంట్ కింగ్‌డమ్, వండర్ఫుల్ స్టోరీస్ ఆఫ్ ది వరల్డ్ తదితర పుస్తకాలను చదివించారు. పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను లైబ్రేరియన్ వివరించారు.

సూపర్ స్టార్ కృష్ణ సేవలు చిరస్మరణీయం


ప్రజాశక్తి - ఏలేశ్వరం

సినీనటుడు సూపర్ స్టార్ కృష్ణ సినీ రంగానికి కాకుండా పేదలకు అందించిన సేవలు చిరస్మరణీయం అని ప్రత్తిపాడు మండల కష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు సలాది కృష్ణ అన్నారు. సూపర్‌స్టార్ కృష్ణ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. సినీ ప్రపంచంలో నూతన ఒరవడి సష్టించిన ఏకైక నటుడు కృష్ణ మాత్రమేనన్నారు. అనంతరం పేదలకు పులిహోరా ప్యాకెట్లు, దుస్తులు, దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్నాలకోట శీను, పెదపాటి నాగేశ్వరరావు, ఇసుకపాటి సత్తిబాబు, ఇరుగుల చక్రం, కాకర నాగేశ్వరరావు, పెదపాటి దుర్గబాబు, పి.శ్రీను, శివకోటి నాని, చెవల శ్రీను ఉన్నారు.



పేదలకు పులిహోర పొట్లాలు అందిస్తున్న కృష్ణ అభిమానులు

కార్టూ'నిజం'



అలాగే.. అవినీతి, లంచాలు, విదేశీ ఖాతాల గుట్టు తేల్చే ప్రాజెక్ట్ చేపట్టడం కుదురుతుందేమో.. ట్రై చేయండి... సారూ!!!

ఎల్ఐసి నిర్వీర్యాన్ని సహించబోము

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రపంచంలోనే అతిపెద్ద బీమా సంస్థ అయిన ఎల్ఐసిని నిర్వీర్యం చేసే విధానాలను సహించేది లేదని ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ రాజమండ్రి డివిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు రావుల మాధవరావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయం ఆవరణలో ఏలేశ్వరం, గోకవరం సంయుక్త ఏజెంట్లు యూనియన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లాభాల బాటలో నడుస్తున్న ఎల్ఐసిని కేంద్రం నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు కొమ్ముగాసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఏజెంట్లు సంస్థ ప్రయోజనాలతో పాటు ఖాతాదారుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గ అధ్యక్షునిగా మండలంలోని తిరుమాలికి చెందిన కోరుకొండ నూకరాజు, కార్యదర్శిగా ఎం.నాగరాజు, కోశాధికారిగా పి.వెంకన్నదొరతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కోరుకొండ నూకరాజు మాట్లాడుతూ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కౌన్సిల్ కార్యదర్శి మాలే నాగబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గోపీనాథ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు జి.నాగేశ్వరరావు, మాజీ కార్యదర్శి వెల్లంపల్లి రాజా ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సభ్యులు

పేద విద్యార్థినికి మానవత సాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మానవత సంస్థ నెలవారీ సమావేశం ఆదివారం పాలంగి మానవత కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు చెరుకూరి సుభాష్ చంద్రబోస్ పాలంగి గ్రామానికి చెందిన తొత్తరపూడి మానస లక్ష్మి చదువు నిమిత్తం రూ.పది వేల ఆర్థిక సహాయం అందజేశారు.



వికలాంగులకు కిట్లు అందజేస్తున్న చందన నాగేశ్వర్

వికలాంగులకు క్రికెట్ కిట్ల అందజేత

ప్రజాశక్తి- ధవళేశ్వరం

వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆదివారం వైసిపి కార్యాలయంలో వికలాంగుల క్రికెట్ జట్టుకు కిట్‌ను అందించారు. డిసెంబర్ నెలలో ఉమాంగ్ వీల్‌చైర్ క్రికెట్ టోర్నమెంట్ భోపాల్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో ఈ జట్టు పాల్గొనుంది. ఈ సందర్భంగ నాగేశ్వరరావు మాట్లాడుతూ వికలాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, వారి విజయంతో రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి వీల్ చైర్ క్రికెట్ టీమ్ ప్రెసిడెంట్ ఎ.మల్లేశ్వరరావు, కెప్టెన్ ఎం.ప్రవీణ్ కుమార్, వైస్ కెప్టెన్ కె.తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-గోపాలపురం

ఫీజు వేసే క్రమంలో కరెంట్ షాక్ తగిలి రైతు మృతి చెందిన సంఘటన గోపాలపురం శివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన ప్రకారం గోపాలపురం గ్రామానికి చెందిన రైతు కురుకూరి సోమరాజు (61) గోపాలపురం శివారులోని తన పొలంలో వ్యవసాయ మోటారుకు చెందిన ట్రాన్స్‌ఫారం ఫీజు పోవడంతో ఫీజు వేసే క్రమంలో కరెంటు షాక్ కొట్టడంతో సంఘటనా స్థలంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు గోపాలపురం ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి-కడియం

కడియం ఉన్నత పాఠశాలలో 1983-84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. సుమారు 100 మంది హాజరైన ఈ సమ్మేళనంలో ముందుగా అప్పటి ముగ్గురు గురువులను సత్కరించారు. పాఠశాల గ్రంథాలయానికి వీరంతా కలిసి రూ.20 వేల ఇనుప బీరువాను పాఠశాల స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కర్రి రాజు, మార్ని లక్ష్మీ నారాయణ, రావిపాటి శ్రీను, గుత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

అభ్యుదయవాదుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగిలోని కోరంగి పర్యాటక కేంద్రంలో అభ్యుదయవాదుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు చెక్కా సింహాచలం ఆధ్వర్యంలో వామపక్ష ఉద్యమాల్లో పని చేసిన, చేస్తున్న వారంతా ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. ప్రజా ఉద్యమాల్లో పనిచేసిన అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఎవరు ఏ స్థాయిలో ఉన్నా ప్రజల ఉద్యమాలకు మద్దతుగా ఉండి సంఘీభావం తెలియజేయాలని అభిప్రాయపడ్డారు. ఈ సమ్మేళనానికి కషి చేసిన డాక్టర్ చలంకు అందరూ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలా కలిసి అనుభవాలను పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు, స్నేహితులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి -రామచంద్రపురం

రామచంద్రపురం లో విద్య అభ్యసించిన 1989-94లో కృత్తివెంటి పేర్రాజు పంతులు కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక ఘనంగా జరిగింది. ఎస్ఐ గుబ్బల మంగాదేవి ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు ఈ సందర్భంగా విద్యార్థులంతా నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఫొటోలు దిగారు. అనంతరం గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యనమదల గ్రామ సర్పంచ్ పివి. రమణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

30న 'ఆక్వా రైతు ఆక్రందన'

ప్రజాశక్తి -అమలాపురం

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 30న అమలాపురంలో నిర్వహించనున్న ఆక్వా రైతు ఆక్రందన కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుతూ అమలాపురం నియోజకవర్గ ఇంచార్జ్ శెట్టిబత్తుల రాజబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం కరపత్రాలు అందయజేశారు. కార్యక్రమంలో కైరం ఆదిబాబు కైరం సత్య, ఎమ్.జిలానీబాబు, కొండవీటి వీరబాబు, నందులశివ, కె.వీర బాబు, ఎన్.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ మృతి టిడిపికి తీరని లోటు

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం ఎంపిటిసి సభ్యునిగా, పంచాయతీ సభ్యునిగా పనిచేసి, అటు ప్రజలకు ఇటు టిడిపికి సేవలు అందించిన వాసంశెట్టి రామకృష్ణ అకాల మరణం తీరని లోటని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కొత్తపేట మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. రామకృష్ణ మృతికి సంతాపంగా ఆదివారం రావులపాలెం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రామకృష్ణ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను సత్యానందరావు పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుత్తుల పట్టాభిరామారావు, కంఠంశెట్టి శ్రీనివాస్, చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి, కాసా విజయ్ సాగర్, వెలగల శ్రీనివాస్ రెడ్డి, చప్పిడి వరప్రసాద్, మల్లిడి శ్రీనివాస్ రెడ్డి, పెచెట్టి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

విశాల వైశాల్యంతో మహా కుడా

కుడా వైస్ చైర్మన్ కె.సుబ్బారావు





ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఏర్పాటైన దగ్గర నుండి దశలవారీగా వైశాల్యాన్ని విస్తరించుకుంటూ వెళుతోంది. జిల్లాల విభజన తర్వాత కాకినాడ జిల్లా మొత్తాన్ని (కొన్ని ప్రాంతాలు మినహా) కుడా పరిధిలోకి చేర్చారు. ప్రస్తుతం 2610.02 చదరపు కిలోమీటర్ల వైశాల్యంగా కుడా పరిధి విస్తరించి ఉంది. మహా కుడాగా ఆవిర్భవించి లక్ష్య సాధనలో ముందుకు వెళుతోంది. 2040 వరకు అమలులో ఉండే మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసి కుడా అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ముందుగానే చేరుకున్నారు. ఈ నేపథ్యంలో కడా లక్ష్యాలను అధిగమించేందుకు కీలక పాత్ర పోషిస్తున్న కుడా వైస్ చైర్మన్ కె.సుబ్బారావు ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూ విశేషాలివి.

కుడా ఏర్పాటులో దేనిని ప్రాతిపదికగా తీసుకుంటారు?

ఎక్కడైనా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలంటే ఆ ప్రాంత భౌగోళిక, నైసర్గిక స్వరూపాన్ని బట్టి తొలుత పర్‌స్పెక్టివ్ ప్లాన్ తయారు చేయాలి. 2017 నుంచి 2021 ఇది తయారు చేశాము.

కుడా ఎప్పుడు ఏర్పాటయ్యింది.. ?

కాకినాడ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్లు, సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురం మున్సిపాలిటీలు, గొల్లప్రోలు నగర పంచాయతీతోపాటు 26 మండలాల్లోని 291 గ్రామ పంచాయతీలతో కూడిన ప్రాంతంతో 2017 మార్చి 15న ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు మొదట్లో గుడా ఆవిర్భవించింది. జిల్లాల విభజన అనంతరం రాజమండ్రి అర్బన్ డవలప్ మెంట్ అథారిటీ (రుడా), కాకినాడ అర్బన్ డవలప్ మెంట్ అథారిటీ (కుడా) విడివిడిగా అవతరించాయి.

ఇటీవల ఎంతవరకూ దీని పరిధి పెంచారు?

తాజాగా కుడా విస్తీర్ణం రెట్టింపయ్యింది. ఇప్పటి వరకు 236.42 చదరపు కిలోమీటర్లుగా ఉన్న పరిధి ఇకనుంచి 2610.02 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. 15 మండలాలు, 172 గ్రామాలు, ఐదు పురపాలక సంఘాల నుంచి 21 మండలాలకు, 7 పురపాలక సంఘాలకు, మరో 180 గ్రామాలకు పెరిగింది. జిల్లాల విభజన తరువాత కాకినాడ జిల్లాలోని 21 మండలాలను కుడాలో చేర్చడానికి ప్రతిపాదించగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ జిల్లాలోని సబ్ ప్లాన్ ఏరియా, కోరింగ అభయారణ్యం, మూడు మండలాల్లోని 15 గ్రామాలతో ఉన్న విశాఖపట్నం పిసిపిఐఆర్ ప్రాంతం మినహా మిగతా అన్ని పట్టణాలు, గ్రామాలను కుడా పరిధిలోకి తీసుకు వచ్చాము.

ప్రాంతాల వారీగా పెరిగిన విస్తీర్ణం ఎంత?

తుని పురపాలక సంఘం పరిధిలో 6.85 చదరపు కిలోమీటర్లు, ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో 15,03 చదరపు కిలోమీటర్ల మేర కుడాలో విలీనం చేశారు. ఇక మండలాల వారీగా చూసుకుంటే పెదపూడిలో పది గ్రామాలు (45.37), కరపలో 23 (68.22), తాళ్లరేవులో 11 (275.55), ఏలేశ్వరంలో 8 (52.69), ప్రత్తిపాడులో 14 (68.19), తునిలో 21 (181.11), కోటనందూరులో 16 (114.84), కాజులూరులో 20 (116.69), రౌతులపూడిలో 32 (152.71), జగ్గంపేటలో 9 (75.54), శంఖవరంలో 10 (54.7), తొండంగిలో 9 (84.86), ఇప్పటి వరకు రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో ఉన్న పెదపూడి మండలంలోని అచ్యుతాపురత్రయం, దోమాడ, కరకుదురు, పెదపూడి, పెద్దాడ, జి.మామిడాడ, కైకవోలు గ్రామాల్లోని 61.25 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని కుడాలో విలీనం చేశారు.

వేటికి కుడా అనుమతులు మంజూరు చేస్తుంది?

కుడా పరిధిలో కొత్తగా చేరిన పురపాలక సంఘాలు, నగర పంచాయతీల పరిధిలో 300 చదరపు మీటర్ల లోపు ఉన్న స్థలాల్లో నిర్మించే గృహాలు (10 మీటర్ల ఎత్తు వరకు గల వ్యక్తిగత భవనాలకు) పంచాయతీ కార్యదర్శులు అనుమతులు ఇస్తారు. బహుళ అంతస్తుల నిర్మాణాలకు, వాణిజ్యపరమైన సంప్రదాయాలకు కుడా అనుమతులు తప్పనిసరి. లే అవుట్ల అనుమతి కూడా కుడా కార్యాలయం నుంచి పొందాలి.

రిజర్వేషన్లను సమానంగా పంచాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఎస్‌సి రిజర్వేషన్ 15 శాతాన్ని 50 ఉప కులాలకు సమానంగా పంచాలని, మూడు దశాబ్దాలుగా మాదిగల ఉద్యమాలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా జనాభా దామాషా ప్రకారం మాదిగ, అనుబంధ కులాలకు రావాల్సిన అన్ని రంగాల్లో వాటాను కల్పించాలని మాదిగ ఆత్మగౌరవ-రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వల్లూరి నాని తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం సామర్లకోట మండలం ఉండూరు గ్రామంలోని జిపిఆర్ గార్డెన్స్‌లో మాదిగల ఆత్మీక కలయిక, కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు వల్లూరి నాని చెప్పారు. మాదిగలకు అన్ని రంగాల్లో రావల్సిన వాటా సాధనకు ఏం సంఘంనైనా సరే కలసి ఐక్యంగా పోరాటాలు చేస్తూ ముందుకు సాగాలని తీర్మానించినట్లు చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలకు 14 ఎంఎల్ఎ సీట్లు, రెండు ఎంపి సీట్లు, ఒక ఎంఎల్‌సి, మూడు మంత్రి పదవులు కేటాయించాలని, ఎస్‌సి వర్గీకరణపై ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలని తీర్మానించామన్నారు.

వినియోగదారుల చట్టంపై పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాత ఆసుపత్రి వీధిలోని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో వినియోగదారుల చట్టం -2019పై విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పిల్లల్లో వినియోగదారుల చట్టంపై అవగాహన పెంపొందించేందుకు ఈ ప్రతిభా పోటీలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, జెవివి సత్యనారాయణ, వినియోగదారుల సంఘం నాయకులు ఎం.భాస్కరరావు, టి.సత్యనారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాకడ పండుగలో పాల్గొన్న ఎంపీ భరత్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నగరంలోని అయిదు బళ్ల మార్కెట్ సెంటర్ రైల్వే కల్యాణ మండపంలో క్రైస్తవ సోదరులు ఆదివారం నిర్వహించిన 'రాకడ పండుగ'లో ఎంపీ మార్గాని భరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి జగన్ దేవుడిని నమ్మారని, ఆయన భరత్‌ను ఎంపీ చేద్దామని తన తండ్రితో చెప్పారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆదేశం ప్రకారం, లక్ష ఓట్ల మెజారిటీతో ఎంపీగా విజయం సాధించానని చెప్పారు. ఇంతటి భారీ మెజారిటీ రావడం వెనుక దేవుని కృప, సిఎం జగన్ తనపై ఉంచిన అభిమానం, నమ్మకమేనని అన్నారు. నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డును 20 అడుగుల వెడల్పుతో విస్తరించి మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నట్టు ఎంపీ తెలిపారు. అనంతరం ఆయన జ్యోతి వెలిగించారు. కేక్ కట్ చేశారు.

ఘనంగా గంధోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కబడ్డీ వీధిలోని జెండా జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి హజరత్ మెహబూబ్ సుభహాని జెండా గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్,అగ్రో డైరెక్టర్ సయ్యద్ జాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్ర దానం, ఆమ్ ఖాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సయ్యద్ బీబీ అమీనా, అంజుమన్ అధ్యక్షులు ఎస్‌ఎ ఖాదర్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వేట్లపాలెం శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివేకానంద ట్యూటోరియల్స్ విద్యార్థులకు ఆదివారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కాకినాడ పడాల చారిటబుల్ ట్రస్టు అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, నిర్వాహకులు, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.



మంచులో వెళుతున్న ప్రయాణికులు, వాహనాలు

పొగ మంచుతో ఇబ్బందులు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పొగ మంచు అధికంగా కురుస్తుండటంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం వేళల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చేవారు ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మీయ కలయిక విజయవంతం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26న అమలాపురం లో నిర్వహించిన అంబేద్కరీయుల ఆత్మీయ కలయికకు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేశారని సర్పంచ్ కుంచె చిట్టికుమారి అన్నారు. ఆదివారం ఎన్.కొత్తపల్లి లో మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకటబాబ్జి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, విజయవంతానికి కషిచేసిన ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలిపారు.s ొంకి బాలకష్ణ, రాజారావు, కుంచె చిన్ని, నేరేడుమిల్లి సత్తిబాబు, నందిక రమేష్, ఎలిపే రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు డీటీగా జానకి

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌గా ఎం.జానకి రాఘవను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జిల్లాలో 20 మందికి పదోన్నతులు కల్పించడంలో భాగంగా ఆలమూరులో రెవెన్యూఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జానకిరాఘవ డీటీగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డీటీగా ఆమెను నియమించడంపై పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

భీమేశ్వరాలయ అర్చకుని మృతి

ప్రజాశక్తి -రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో వంశపారంపర్య అర్చకులు జుత్తిక ధర్మ వెంకట సుబ్రహ్మణ్య శర్మ ఆదివారం ఉదయం మతి చెందారు. ఆయన మతికి సంతాపం తెలుపుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూసివేశారు. సుబ్రహ్మణ్యశర్మ మృతికి ఆలయ సిబ్బంది, ఇఒ అధికారి తారకేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపారు.

నిరుపేద మహిళకు 'గుడ్ సీడ్' ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం



చల్లపల్లి పంచాయతీ అంబేద్కర్ నగర్‌లో మహిళకు సాయం అందజేసిన రమణారావు

ఒంటరిగా జీవిస్తున్న నిరుపేద మహిళకు ఆదివారం గుడ్ సీడ్ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. చల్లపల్లి పంచాయతీ అంబేద్కర్ నగర్ కు చెందిన నిరుపేద మహిళ చీకురుమిల్లి రమాబాయి ఒంటరిగా జీవిస్తోంది. ఆమె పరిస్థితి తెలుసుకున్న గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్, అమలాపురం నియోజకవర్గం వైసిపి యువజన నాయకుడు కుంచే రమణారావు ఆర్థిక సాయం తోపాటు నిత్యావసర సరుకులు అందించి ప్రతి నెలా తాను రూ.2 వేల సాయం అందిస్తానని రమాభాయికి భరోసా ఇచ్చారు. రమణా రావును గ్రామస్తులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. పరమట సత్య నారాయణ, ఏడుకొండలు, కాట్రు మధు, కొల్లు దేవేంద్రుడు, పాము నాగేశ్వరరావు, రొక్కాల సతీష్, కుసుమ ఆనంద్, హేమంత్, నేరేడుమిల్లి శ్రీను, బాబి, పరమట రాజేష్, నాగాబత్తుల రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి కి చెందిన చీకురుమిల్లి రమాబాయికి మాతా రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు పుణ్యమంతుల రజని, అనాతవరం, చల్లపల్లి, చినగాడవిల్లి, అయినవిల్లి సంఘ శాఖల సభ్యులు తదిరులు పాల్గొన్నారు.

28 నుంచి షష్టి ఉత్సవాలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగర, కపిలేశ్వరపురం గ్రామాల్లో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాలు ఈనెల 28 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించినట్లు ఇఒలు పివి.రామ కష్ణ చార్యులు, ఎఎస్‌బిజి.రామలింగం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాలను సుందరంగా తీర్చిదిద్ది, చలువ పందిర్లు ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 28న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణం, గ్రామోత్సవం, 29న. సుబ్రమణ్య స్వామి తీర్థం మహోత్సవం, 30న .రత్న మాల నాటకాలు, డిసెంబరు 1న. పంపన త్రిమూర్తులు భజన కోలాటం, 2న. స్వామివారి కంకణ సేవ, 3న. స్వామివారి శ్రీ పుష్పోత్సవం, తో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాలు ముగిస్తాయన్నారు. ఆలయాల వద్ద ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అంగర ఎస్ ఐ ఎస్ బాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు.



ఉండూరు పంటకాలువలోకి దూసుకుపోయిన కారు

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం ఉండూరు గ్రామానికి వెళ్లే రోడ్డులో ఉండూరు నుండి సామర్లకోట వైసు వస్తున్న కారు ఆదివారం సాయంత్రం ఒక కారు అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్ళింది. అయితే కారులో వున్న ఇద్దరు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. స్థానికులు వారిని కారు నుంచి బయటకు తీశారు. కాల్వలో నీటి ప్రవాహం పెద్దగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారు యజమాని క్రేన్ సహాయంతో కారును బయటకు తీయించారు.

జాతీయ అవయవదాన దినోత్సవం

ప్రజాశక్తి - సీతానగరం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రఘుదేవపురంలో అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అవయవాలు దానం చేసి చనిపోయిన వారిని జ్ఞాపకం చేసుకున్నారు. అవయవ దానం చేసిన కుటుంబాలు సమాజానికి అందించిన సేవలకు గుర్తుగా ఈ దినోత్సవం జరుపు కుంటున్నామని రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ డాక్టర్ సత్యం రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్, సుధాకర్ తదితర రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

సక్షషన్ ఓ.పి. నెం. 04/2022

Between:

పిటీషనరు: పల్లంట్ల హేమంత్

(Petitioner being minor rep by its next friend guardian paternal Grand Father Pallantla Venkata Rao)

Vs

రెస్పాండెంటు:

Union Bank of India, Devarapalli Branch, rep. by its Branch Manager, Devarapalli.

జనరల్ నోటీసు

మైనరు పిటీషనరు తల్లి అయిన పల్లంట్ల రత్న పోశమ్మ గారు వారి యొక్క A/c. 217410100014417 నెంబరు గల సేవింగ్స్ బ్యాంకు ఎకౌంట్ తమ దేవరపల్లి బ్రాంచ్ నందు ఉండగా సదరు ఎకౌంట్‌లో Rs. 35,305/- సొమ్ము నిల్వ వుండియున్నది. దర్మిలా సదరు పల్లంట్ల రత్న పోశమ్మ గారు ది. 06-5-2021వ తేదీన కాలం చేసినందున సదరు ఖాతాలోని నిల్వ వున్న సొమ్ము Rs. 35,305/- మరియు అందుపై వడ్డీ తీసుకొనుటకు ఆమె వారసుడు పిటీషనరు "సక్షషన్ సర్టిఫికెట్" ఇప్పించమని పై కోర్టులో పై నెంబరు సక్షషన్ ఓ.పి. దాఖలు చేసియున్నారు. సదరు సక్షషన్ ఓ.పిలో ఎవరికైనా ఏమైన అభ్యంతరములు వున్న యెడల పై కోర్టు వారి ఎదుట ది. **07-12-2022వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** హాజరై తెలియపర్చుకొనవలెను.

నూకవరపు రవిబాబు

కొవ్వూరు పిటీషనరు తరపు న్యాయవాది

ది.26-11-2022 కొవ్వూరు

నేరాలు ఘోరాలు

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి -అమలాపురం

గాంధీ విగ్రహానికి కళ్లకు గంతులు కట్టిన ముగ్గురిపై అమలాపురం టౌన్ పరిధిలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌పి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. కొంతమంది గుర్తు తెలియని యువకులు శనివారం తమ వాహనాలపై అమలాపురం టౌన్ పరిధిలో తిరుగుతూ గడియార స్తంభం సెంటర్లో ఉన్న గాంధీ విగ్రహానికి కళ్ళకు తువాలుతో గంతలు కట్టారు. ఈ ఘటనలో పాల్గొన్నట్లు గుడ్డివాని చింతకు చెందిన ఇద్దరు, పాలగుమ్మికి చెందిన ఒక వ్యక్తిని గుర్తించినట్లు తెలిసింది. వీరిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు అయ్యాయి. అదే రోజు సాయంత్రం అద్దంకివారిలంక నుంచి అమలాపురం వస్తున్న బస్సును కొంతమంది యువకులు నల్ల వంతెన వద్ద బొలెరో వాహనంతో అడ్డగించారు. బస్సు పైకి ఎక్కి అల్లరి చేయడమే కాకుండా అడిగినందుకుగాను బస్సు డ్రైవర్ ను బెదిరించారు. బొలెరో వాహనంతో బస్సు ముందర భాగాన్ని డ్యామేజ్ చేశారు. ఈ విషయమై బస్సు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు పై అమలాపురం టౌన్ లో మరో కేసు నమోదు చేసినట్లు ఎస్‌పి కార్యాలయం వివరించింది. అంతేకాక బస్సును ధ్వంసం చేసిన కేసులో నిందితుల కోసం ఎస్‌పి సుధీర్ కుమార్ రెడ్డి ఆదేశాలతో ప్రత్యేక దర్యాప్తు బందాలు రంగంలోకి దిగి గాలిస్తున్నాయన్నారు.

గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం

గాంధీ విగ్రహాన్ని అవమానించినందుకు నిరసనగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కంచర్ల బాబీ ఆధ్వర్యంలో ఆదివారం మహాత్మ గాంధీ క్షీరాభిషేకం చేశారు. దోషులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతి పత్రం అందజేశారు.

కేసు నమోదుకు డిమాండ్

గాంధీ విగ్రహాన్ని దళితులు ముట్టుకుంటే క్షీరాభిషేకం చేస్తారా అని దళిత నాయకులు మండిపడ్డారు. ఆదివారం దళిత నాయకులు అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ ను ముట్టడించారు. గాంధీజీ విగ్రహానికి పాలాభిషేకం చేసిన వైశ్యులపై కేసు నమోదు చేయాలని వారు పోలీసులను డిమాండ్ చేశారు.



డ్రంక్‌అండ్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఐదుగురిపై కేసు

ప్రజాశక్తి -ఏలేశ్వరం

ఏలేశ్వరం ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల యువత మద్యం బారినపడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏలేశ్వరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టి ఐదుగురిపై కేసులు నమోదు చేశామన్నారు. నిందితులను సోమవారం కోర్టుకు తరలించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ మాణిక్యం కానిస్టేబుల్ శ్రీనివాస్, ఎపిఎస్‌పి సిబ్బంది ఉన్నారు.

NAME CHANGE

I, SANGANA PEDA POSAYYA, S/o. Appa Rao, D.No. 1-45, Singavaram Village, Seethanagaram Mandal, East Godavari District, A.P., (Cell:9010537616) have changed my name from **SANGINA PADA POSAYYA** (Old Name) to **SANGANA PEDA POSAYYA** (New Name). Hence after all my documents and correspondence will be continue with my new name as "**SANGANA PEDA POSAYYA**".

మహారాజశ్రీ అమలాపురం 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు

ఓ.ఎస్.నెం. 10/2019

బిట్వీన్:

రెడ్డి రామతులసి ...వాది

అండ్

షేక్ మదర్ బీబి ...ప్రతివాది

టు: ప్రతివాది:

షేక్ మదర్ బీబి, భర్త: సత్తార్ సాహెబ్, వయస్సు 60 సం॥లు, హౌస్ వైఫ్, డో.నెం. 15-5-20, 20వ వార్డు, రెడ్డి వారి వీధి, మండపేట పట్టణం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆం॥ప్ర॥

పై నెంబరు దావాలో ప్రతివాదికి శ్రీ కోర్టు వారి ద్వారాను, పోస్టు ద్వారాను పలు పర్యాయములు నోటీసులు పంపించగా అమలు జరుగనందున సదరు ప్రతివాది నోటీసులు అమలు నిమిత్తం **ది.16-12-2022వ తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా ప్రతివాదికి ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

గుండాబత్తుల బాల రవితేజ

అమలాపురం, అడ్వకేట్, అమలాపురం.

26-11-22. సెల్: 95336 27779